క్లుప్తంగా

బైపాస్ నిర్మించాలి

భవన యజమానుల ధర్నా



హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న వ్యాపారులు, భవన యజమానులు

హుస్నాబాద్: ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి కోసం హుస్నాబాద్ శివారు నుంచి బైపాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం హుస్నాబాద్ వ్యాపారులు, భవన యజమానులు ధర్నా నిర్వహించారు. దుకాణాలు బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణంలో పట్టణంలోని మెయిన్ రోడ్‌లో 800 ఇళ్లు కోల్పోతున్నామన్నారు. పట్టణంలో వంద అడుగుల రహదారి నిర్మించడానికి అధికారులు మార్కింగ్ పెట్టారని, పది అడుగులు తగ్గించాలని మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పునరాలోచించి హుస్నాబాద్ శివారు నుంచి బైపాస్ నిర్మించాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తొగుట(దుబ్బాక): మండలంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎంపీపీ లత, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. రాంపురం ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రూ.75 లక్షలతో ప్రహరీ, తొగుట కేజీబీవీ ప్రహరీ నిర్మాణానికి రూ.27 లక్షలు, తుక్కాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రహరీకి రూ.14.30 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణ, ఉప్పలయ్య, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య భారత్ దిశగా కొనసాగాలి



మాట్లాడుతున్న సీడీపీవో శారద

కొమురవెల్లి(సిద్దిపేట): అందరికీ పోషకాహారం అందించి ఆరోగ్య భారత్‌గా మార్చాలని చేర్యాల సీడీపీఓ శారద అన్నారు. శనివారం మండలంలోని మర్రిముచ్చాల పోషణ్ పక్వాడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రీ స్కూల్ కార్యక్రమాలపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు పోషకాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య లేకుండా పండంటి బిడ్డకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పావని, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సయపల్లి, లద్నూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ఉంచిదే తప్ప ఏమీ అభివృద్ధి చేయలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ క్లబ్, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో చలివేంద్రాన్ని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, రీజియన్ 3 చైర్మన్ మంకాల శ్రీనివాస్, జోన్ చైర్మన్ తోడుపునూరి కృష్ణవేణి, అధ్యక్షురాలు మర్యాల వాణి, ప్రధాన కార్యదర్శి కొండూరి మాధవి, కోశాధికారి చింత రజని పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

సిద్దిపేటజోన్: మహిళల ఆర్థిక బలోపేతానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అందులో భాగంగానే కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మంజుల తెలిపారు. శనివారం పట్టణంలోని 2, 31 వార్డుల్లో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ప్రసన్నరాణి, వైస్ చైర్మన్ కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లిలో రోడ్డుపై బైఠాయించిన దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక):/దుబ్బాకటౌన్: ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ అరెస్ట్‌ను నిరసిస్తూ అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ శ్రేణులతోకలిసి రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్ర పూరితంగా బీఆర్ఎస్‌ను దెబ్బ తీయడానికే ఎమ్మెల్సీని కేంద్రం అక్రమంగా అరెస్ట్ చేసిందన్నారు. కవిత అరెస్ట్‌ను దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. అరెస్ట్‌లతో బయపడేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి, నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు, బుచ్చయ్య, కనకయ్య, ఉల్లెంగెల నరేష్ తదితరులు పాల్గొన్నారు. సుమారు గంటపాటు జరిగిన రస్తారోకోతో సిద్దిపేట-రామాయంపేట రహదారికిరువైపులా వాహనాలు నిలిచి పోవడంతో ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

కేంద్రం కుట్ర

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగా ఈడీ అధికారులు ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. కవిత అరెస్టను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకసభ ఎన్నికల సమయంలో కేసీఆర్‌పై కక్ష కట్టి బీఆర్ఎస్ పార్టీకి నష్టం చేయాలనే కుట్రతో కవితను అరెస్ట్ చేశారన్నారు. బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రాంతీయ పార్టీలు ఉండకూడదని, ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, ఐటీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు. వెంటనే కవితను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ లకావత్ మానస, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, మండల అధ్యక్షుడు గంగం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్సీ కవిత అరెస్టను నిరసిస్తూ శనివారం పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ స్వరూప శ్రీధర్ రెడ్డి, ఎంపీపీ కరుణాకర్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, కౌన్సిలర్లు చంటి, సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాదిగ

మిరుదొడ్డి(దుబ్బాక): హక్కుల సాధనకు మాదిగలు ఐక్య ఉద్యమాలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శనివారం ఎమ్మార్పీస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధించేందుకు మాదిగలు ఐక్యంగా పోరాడాలన్నారు. వర్గీకరణకు కట్టుబడి ఉన్న మోదీ తన మాట నిలబెట్టుకోవాలని కోరారు. మాదిగలను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని చూసే పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల భూపాల్, రాష్ట్ర కార్యదర్శి రాజమల్లు, మిరుదొడ్డి మాజీ ఉప సర్పంచ్ కనకయ్య, నాయకులు బాబు, మల్లయ్య, ఎల్లయ్య, భూమ రాజయ్య,బాలరాజు పాల్గొన్నారు.

ఒకే పోర్టల్‌లో అభివృద్ధి పనుల వివరాలు

డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎల్పీఓ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్‌రూరల్: పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులు ఒకే పోర్టల్‌లో చేర్చడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి విషయసూచిక అవగాహన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు వివిధ శాఖలకు సంబంధించిన పనులు ఒకే పంచాయతీ పోర్టల్‌లో కనిపించే విధంగా కార్యదర్శులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అభివృద్ధి పనుల నమోదులో 500 ప్రశ్నలు ఉంటాయని, వాటిపై అవగాహన పెంచుకొని సమాచారం సేకరించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీఓలు సత్యనారాయణ, సీడీపీఓ జయ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం అక్రమ రవాణా

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి
- మైలారం, రుద్రారంలో బియ్యం పట్టివేత



మైలారం శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం ఆటో

వర్గల్(గజ్వేల్): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి పట్టుకున్నారు. వర్గల్ మండలం మైలారం వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. గజ్వేల్ టౌన్‌లోని వేములగట్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎల్లేడ్ తిరుపతి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా వర్గల్ మండలం మైలారం నుంచి గజ్వేల్‌కు తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. శనివారం ఉదయం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐ జానకిరాంరెడ్డి, గౌరారం పోలీసులు ఉదయం కాపు కాసి ఆటోలో మైలారం నుంచి గజ్వేల్ వైపు తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మైలారం శివారులో పట్టుకున్నారు. గౌరారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో రేషన్ డీలర్ నాగభూషణం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శనివారం పౌర సరఫరాల శాఖ, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి విచారణ చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న 48 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

కురుమలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



బింగి స్వామి

గజ్వేల్: అత్యధిక జనాభా కలిగిన కురుమ కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కులాల అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేయడానికి నిర్ణయించడం హర్షనీయమన్నారు. అత్యధిక జనాభా ఉన్న కురుమలు, యాదవులకు ఒకే కార్పోరేషన్ ఏర్పాటు చేయడం సరి కాదన్నారు. కురుమలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

సిద్దిపేట విద్యార్థుల ప్రతిభ



ఢిల్లీ టాస్క్‌కు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థులు నూతన ఆవిష్కరణకు కేంద్ర ప్రభుత్వ జాబితాలో చోటు దక్కించుకున్నారు. విద్యార్థులు వంశీ, సోహైల్, అసద్, కార్తీక్, హృతిక్ కేంద్ర ప్రభుత్వ టాస్క్ ద్వారా సైబర్ క్రైం అంశాలపై నూతన వైబ్‌సైట్‌ను రూపొందించారు. ఈనెల 20వ తేదీన ఢిల్లీలో వివిధ రాష్ట్రాల ప్రతినిధుల కాన్ఫరెన్సులో వీరు తమ ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారు. ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు విద్యార్థులను అభినందించారు.

వందరోజుల్లో హామీలు అమలు

సిద్దిపేట రూరల్: ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలోపు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు లతారెడ్డి, మున్నూరు కాపు యూత్ అధ్యక్షుడు ఆకుల సంతోష్‌కుమార్ హరికృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రం, రాష్ట్ర ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కార్యదర్శి బాబేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీద్వారా పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం



సిద్దిపేట కోర్టులో పత్రాలను అందజేస్తున్న న్యాయమూర్తులు

సిద్దిపేటకమాన్: రాజీయే రాజమార్గమని, ఏళ్ల తరబడి నడుస్తున్న కేసులను లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిద్దిపేట న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పలు కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి రఘురాం మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసును పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులు విలువైన సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు పై కోర్టుకు వెళ్లే అవకాశం లేదని, కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా తిరిగి పొందవచ్చన్నారు. తొమ్మిది బెంచ్‌ల ద్వారా సివిల్, క్రిమినల్ 6,190 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.58,80,000 ఇప్పించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై నమోదు చేసిన ఈ-పెట్టి కేసులు 3,34,471 పరిష్కరించి వారి చేత రూ.5,63,28,280 జరిమానా కట్టించినట్లు తెలిపారు.

హుస్నాబాద్: చిన్నచిన్న కేసుల సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. హుస్నాబాద్ కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ కుదిరిన కేసులను పరిష్కరించారు.

1400 కేసులు పరిష్కారం

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, గజ్వేల్ ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో గజ్వేల్ కోర్టులో శనివారం 1400 కేసులు పరిష్కరించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పిండిగిర్నీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అఫ్జలుద్దీన్

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లిలో డీఆర్‌డీఓ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద అందజేసిన పిండి గిర్నీని శనివారం ఎంపీడీఓ అఫ్జలుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం జై దుర్గమాత స్వయం సహాయక సంఘానికి చెందిన నవనీత పిండి గిర్నీకి దరఖాస్తు చేసుకున్నారని, 35 శాతం రాయితీతో అందజేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుస్వయం ఉపాధి కింద పిండి గిర్నీ యంత్రాలను 35 శాతం రాయితీ ఇస్తాయని, మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, మాజీ సర్పంచ్ భాగ్య, బాల్‌రాజు, మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి, ఏపీఎం కిరణ్‌కుమార్, ఏపీజీవీబి బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి వికాస్, సీసీ కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



ఉత్సవాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటరూరల్: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల పరిధిలోని మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విజయవంతంగా 25 సంవత్సరాలు నిర్వహిస్తూ సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఎఫ్ సీఈఓ సవితదతేమినాన్, ఆర్డీఎఫ్ సెక్రటరీ కిరణ్ అడ్డాల, ఆర్డీఎఫ్ డైరెక్టర్ అమ్రపాలి, ఆర్డీఎఫ్ సీఈఓ వందితరావు, ఎంపీపీ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ నర్సింగోజు విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రస్తుత కాలంలో మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలు, చేతబడులంటూ నయం చేస్తామని చెప్పేవారిని నమ్మొద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. అపరిచితుల సమాచారం ఇవ్వాలన్నారు.

ఎంపీ పర్యటనలో..



దాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బండి సంజయ్ కుమార్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో పలు అభివృద్ధి పనులకు కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. బెజ్జంకితో పాటు, దాచారం, లక్ష్మీపూర్, బేగంపేట, గుండారం గ్రామాల్లో పర్యటించి పనులను ప్రారంభించారు. లక్ష్మీపూర్‌లోని శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, చాడ వెంకట్‌రెడ్డి, అనిల్ రావు, రాజు, దొమ్మాటి రాములు, మల్లేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన మల్లేశం తన ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించారు. శనివారం బాధితుడు మల్లేశంకు ఎస్ఐ అపూర్వరెడ్డి అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యుత్ సరఫరా బంద్

మర్కూక్(గజ్వేల్): మండలంలోని కర్కపట్ల గ్రామ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుధీర్ తెలిపారు. కేవలం కర్కపట్లలో మాత్రమే మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ మల్లన్న భక్తులకు త్వరలో ఎస్‌బీఐ సేవలు

కొమురవెల్లి(సిద్దిపేట): త్వరలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి భక్తులకు ఎస్‌బీఐ సేవలు అందించనున్నట్లు ఎస్‌బీఐ ఏజీఎం అరుణజ్యోతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ శాఖ ఏర్పాటుకు పలు భవనాలను పరిశీలించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. మే మొదటి వారంలో బ్యాంకు సేవలు ప్రారంభిస్తామన్నారు. ఎస్‌బీఐ శాఖ ఏర్పాటు చేస్తున్నందుకు ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

◆ కల్లు గీతవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీకాంత్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడకు చెందిన పెద్దంకుల శ్రీకాంత్‌గౌడ్ కల్లుగీత వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శిగా శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ నుంచి నియామక పత్రం అందింది. కార్యక్రమంలో సంఘం సభ్యులు భాస్కర్, పాశం శివ తదితరులు పాల్గొన్నారు.

◆ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): మండలంలోని జప్తినాచారం గ్రామానికి చెందిన వడ్లకొండ రవీందర్‌గౌడ్ ఐఎన్‌టీయూసీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి బుద్దారం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ భారత్ పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట శివారు కట్కూర్ స్టేజీ వద్ద సింగిల్ విండో ఆధ్వర్యంలో భారత్ పెట్రోల్ బంక్ నిర్మాణ పనులకు సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య శనివారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మూతపడిన భారత్ పెట్రోల్ బంక్ పునః ప్రారంభానికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు తదతరులు పాల్గొన్నారు.

◆ పుస్తక పఠనం అలవరుచుకోవాలి

ములుగు(గజ్వేల్): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచుతాయని, ప్రతీఒక్కరు పుస్తక పఠనం అలవరుచుకోవాలని బహిలంపూర్ ఎంపీటీసీ సభ్యుడు లింగారెడ్డి అన్నారు. బహిలంపూర్‌లో రూ.3 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఉపయోగపడుతాయన్నారు. యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు లైబ్రేరియన్ సబిత, పంచాయతీ కార్యదర్శి రాజు, నాయకులు నాగులు, కనకయ్య, దయాకర్‌రెడ్డి, గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలుచోట్ల తమ సిబ్బందితో వారం క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 35 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి రూ.14,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ ఉచిత యోగా శిక్షణ

చేర్యాల(సిద్దిపేట): ఉచిత యోగా శిక్షణ తరగతులు వికాస్ గ్రామర్ స్కూల్లో సోమవారం నుంచి వారం పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంతపురి చంద్రమౌళి, బూనాద్రి కిషన్ శనివారం తెలిపారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ సిద్దిపేట సహకారంతో సేవా భారతి చేర్యాల ఆధ్వర్యంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ అవార్డు గ్రహీత తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యుడు తోట సతీష్ శిక్షణ ఇస్తారన్నారు. సాయంత్రం 5:30 నుంచి 6:30 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు.

◆ పీడిత జన పక్షపాతి సాహూ

హుస్నాబాద్: పీడిత, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన విప్లవసేనాని సాహూ అని పలువురు నాయకులు కొనియాడారు. వామపక్ష పోరాట యోధుడు సాహూ అలియాస్ శనిగరం వెంకటేశ్వర్లు 31వ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. గిరిజన పోరాట యోధుడు కొమురం భీం జీవిత చరిత్ర, ఎన్నో శ్రామిక గీతాలను సాహూ రచించారన్నారు.

◆ విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

వర్గల్(గజ్వేల్): మండలంలోని తున్కిఖాల్సా ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా నిశాంత్, ప్రధానోపాధ్యాయులుగా సిద్రజ, ఎంఈఓగా మధు, ఉపాధ్యాయులుగా గాయత్రి, మధు, ఊర్మిళ, సంపత్, వైష్ణవి తదితరులు వ్యవహరించారు.

◆ వాహనాల తనిఖీ

సిద్దిపేటఅర్బన్: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. శనివారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నాల ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు వాహనాల తనిఖీ నిర్వహించాయి.

◆ సమాజంలో మహిళల పాత్ర ఎనలేనిది

గజ్వేల్‌రూరల్: సమాజంలో మహిళల పాత్ర ఎనలేనిదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని శనివారం గజ్వేల్ పట్టణంలో సన్మానించారు. మహిళలకు పురస్కారాలు అందించిన రచయిత రాయారపు విశ్వేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిల్ గోపాల్‌రెడ్డి, బండారు రామ్మోహన్‌రావు, డాక్టర్ పద్మజ్యోతి, విజయలక్ష్మీ, డాక్టర్ జ్యోతిరెడ్డి, మృణాళిని, భవాని, శార్వాణి, సంపూర్ణ, వసంతలక్ష్మీ పాల్గొన్నారు.